

ఘనంగా దసరా వేడుకలు



పాలమూరులో ఆకాశ దీపం



పాలమూరు : వేదికపై ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు



వనపర్తి: జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న రాజాకృష్ణ దేవరావు



ధరూర్ : బూరెడ్డిపల్లిలో ఉత్సవ మూర్తుల ఊరేగింపులో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్ : ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి పూలు అందిస్తున్న ముస్లిం నాయకులు

- పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి
- పురవీధుల్లో శోభాయాత్ర
- జిల్లా కేంద్రాల్లో రావణ దహనం
- పాలమూరులో వేడుకలకు హాజరైన ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం
- అబ్బుర పరిచిన ఆకాశదీపాలు
- జనసంద్రంగా మారిన బాలుర కళాశాల మైదానం

మహబూబ్‌నగర్, అక్టోబరు 13: విజయ దశమి వేడుకలు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. వాహన, ఆయుధ పూజలు చేసి సాయంత్రం శమీ వృక్షానికి పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరి శమీ (బంగారం) ఇచ్చిపుచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సాయంత్రం పాలమూరు పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రావణదహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో రావడంతో మైదానం జనసంద్రంగా మారింది. అంతకుముందు దసరా ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఆర్యసమాజ్ నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ధ్వజదారిగా కౌన్సిలర్ అచ్చుగట్ల అంజయ్య వ్యవహరించారు. హనుమాన్ వ్యాయామశాల గౌలి వెంకటేశ్ ఆధ్వర్యంలో సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారుల ఆకట్టుకున్నారు. రాం మందిర్ చౌరస్తాలోని దసరా కట్ట దగ్గర జెండాను ఆవిష్కరించారు. ఎంపీ డీకెఅరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నారాయణపేట పట్టణంలోని బారంబావి వద్ద వీహెచ్‌పీ, బజరంగ్‌దల్ ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వనపర్తిలో సంస్థానాధీశుల వారసుడు రాజా కృష్ణ దేవరావు ఆయన కుమారుడు ఆరుద్రరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజలు చేశారు. జోగుళాంబ జిల్లా కేంద్రంలోని తేరు మైదానంలో రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ బుద్ధ ఘాట్ వద్ద శమీ వృక్షానికి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు.



నారాయణపేట : మక్తల్ పట్టణంలోని రాంలీలా మైదానంలో రావణ దహనం

మిరుమిట్లు గొలిపే కాంతులతో..

పాలమూరు పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రావణ దహన కార్యక్రమంలో పేల్చిన బాణసంచా కాంతులు ఆకాశంలో మిరుమిట్లు గొలిపాయి. ఈ అద్భుత దృశ్యాలను తిలకించేందుకు జనం భారీ సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా ఆకాశదీపాలు గాలిలోకి వదిలి బాణసంచా పేల్చుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాణసంచా ఆకాశంలో మిరుమిట్లు గొలిపే కాంతులతో కనువిందు చేశాయి. వాసుకి, ఆదిశేషు సర్పాలు విషం చిమ్ముతున్నట్లుగా పేల్చిన బాణసంచా అందరినీ ఆకట్టుకున్నాయి. చివరగా రావణ దహనంతో వేడుకలు ముగిశాయి. అంతకు ముందు ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి జరుపుకుంటామని, విజయదశమి ప్రతీ ఒక్కరి జీవితాలలో విజయం నింపాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మంచీచెడు ఉంటాయని, మనసులో 10 అవలక్షణాలు నిత్యం మంచికి చెడుకు మధ్య సంఘర్షణ చేస్తుంటాయని, మనల్ని మనం శుద్ధిచేసుకోవాలని అన్నారు. అందుకే పది తలల రావణదహనం చేసుకుంటామని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు బురుజు సుధాకర్‌రెడ్డి, షబ్బీర్‌అహ్మద్, సంజీవ్ ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రి, బెక్కరి అనిత, చంద్ర కుమార్‌గౌడ్, డా.మురళీధర్‌రావు, రవికుమార్, బురుజు రాజేందర్‌రెడ్డి, రామాంజనేయులు, సురేందర్‌రెడ్డి, సీజె బెనహర్, కెఎస్ రవికుమార్, మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ : పాలమూరు బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రావణ దహనాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో హాజరైన జనం



మహబూబ్‌నగర్ : బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రావణ దహనం



కొండారెడ్డిపల్లిలో జమ్మి చెట్టుకు పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సొంతూరులో.. సీఎం సంబురాలు

- కుటుంబ సభ్యులతో విజయ దశమి జరుపుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బతుకమ్మ, బోనాలు, ఆటపాటలతో స్వాగతించిన గ్రామస్థులు



కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డికి బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లికి ఆయన రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతీ ఏటా దసరా ఉత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరయ్యే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి సొంత ఊరిలో అడుగు పెట్టారు. గ్రామ ప్రజలు ఆయనకు కోలాటం వేస్తూ బోనాలు, బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్ రెడ్డిలు హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఉన్నారు. నాగర్ కర్నూల్ మినీ ట్యాంక్‌బండ్‌పై కూడా దసరా సంబురాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరయ్యారు. కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తిలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి షమీ పూజల్లో పాల్గొన్నారు.



కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న కళాకారులు

పత్తిని కొనేదెప్పుడు..?



శాంతినగర్ చుట్టు పక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేసిన పత్తిని లారీలో కర్నూలు వైపు తరలిస్తున్న దృశ్యం

- సీసీఐ ఆధ్వర్యంలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న పత్తి రైతులు
- పక్క రాష్ట్రానికి తరలిస్తున్న వ్యాపారులు
- జిల్లాలో లక్ష ఎకరాలకుపైగానే పత్తి సాగు
- వారం రోజుల్లో పడిపోయిన ధరలు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 13 : వానాకాలంలో సాగు చేసిన పత్తి దిగుబడి వస్తోంది. కానీ సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో పత్తి రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్ల ప్రారంభించారు. ఇక్కడి అధికారులు మాత్రం ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా రైతులకు సమాచారం ఇవ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.7,521లు నిర్ణయించింది. పత్తి పంట చేతికొచ్చిన ప్రారంభ దశలో మార్కెట్‌లో పత్తి క్వింటాలు రూ. 8వేల నుంచి రూ.9వేల దాక పలికింది. వర్షాల కారణంగా పత్తి నాణ్యత దెబ్బతిన్నదని వ్యాపారులు ధర తగ్గించారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు ధర రూ.6,800 నుంచి రూ.7వేలు పలుకుతోంది. దళారులు మాత్రం గ్రామాల్లో రైతుల వద్ద నుంచి రూ.6వేలు, రూ.6,400కు కొనుగోలు చేసి ఏపీ, కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా వ్యాపారులు పత్తిని రాష్ట్రం దాటిస్తూ స్థానిక మార్కెట్లకు సెస్ ఎగనామం పెడుతున్నారు. దీంతో జిల్లాలో పలు చోట్ల మార్కెటింగ్ అధికారులు తనిఖీలు కట్టుదిట్టం చేసినా దళారులు రాత్రి సమయంలో సరిహద్దు దాటిస్తున్నారు. ఇప్పటికే వేలాది క్వింటాళ్ల పత్తి ఇతర రాష్ట్రాలకు తరలినట్లు తెలుస్తోంది.



గ్రామాల్లో రైతుల నుంచి దళారులు కొనుగోలు చేసిన పత్తి



ఏపీకి తరలుతున్న పత్తి లారీల వద్ద వ్యాపారుల నుంచి సెస్ వసూలు చేస్తున్న మార్కెట్ అధికారులు

తక్కువ ధరకే అమ్ముకున్నా..



ఐదు ఎకరాలలో పత్తి పంట సాగు చేశాను. ఇప్పటికే రెండో సారి పత్తి తీశాము. సీసీఐ కొనుగోలు కోసం ఎదురు చూసి చూసి దళారులకు రూ. 6,200లకు క్వింటాలు లెక్క అమ్ముకున్నాము. ఇంకా పత్తి దిగుబడి వస్తుంది ఇకనైనా సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రారంభిస్తే బాగుంటుంది.

- మద్దిలేటి, రైతు మానవపాడు

నీటి కుంటలో పడి బాలుడి మృతి

తాడూరు, అక్టోబరు 13 : ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి బాలుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన సాయిబాబు, పద్మ దంపతుల మొదటి సంతానం జగన్(11) ఆదివారం మధ్యాహ్నం వారికి ఉన్న రెండు గేదెలు రెండు ఆవులకు నీళ్ల తాపేందుకు గ్రామ సమీపంలో ఉన్న కుంట వద్దకు వెళ్లాడు. నీళ్ల తాపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఈత రాకపోవడం మూలంగా కుంటలో పడిపోయాడు. ఆ సమయంలోనే ఆ బాలుని వెంట మరో ఇద్దరు చిన్నారులు సైతం ఉన్నారు. నీళ్లల్లో పడిన జగన్‌ను చూసిన చిన్నారులు వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే ఘటన స్థలికి చేరుకుని కుంటలో చూడగా అప్పటికే అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. దీంతో ఆ బాలుడ్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



లింగమ్మ (ఫైల్)

మరికల్, అక్టోబరు 13 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం నారాయణపేట జిల్లా తీలేరు గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తాగు నీరు వదిలారు. బోడి లింగమ్మ (65) నల్లాకు మోటారు అమర్చేక్రమంలో విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆమె మృతితో పండుగ పూట ఆ గ్రామంలో విషాదం నెలకొంది. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు దాదాపు నెల రోజుల నుంచి గ్రామంలో తాగునీరు సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రశాంత్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌కు పలు మార్లు విన్నవించినా ఏ మాత్రం పట్టించుకోకపోవడంతోనే నేడు నిండు ప్రాణం గాలిలో కలిసి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గవినోళ్ల వెంకట్‌రెడ్డి, రాంచంద్రయ్య రాము, దేవదాస్, వెంకటన్న నివాళి అర్పించారు.



జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

రికార్డు స్థాయిలో.. జల విద్యుత్ ఉత్పత్తి

- 500 మిలియన్ యూనిట్లు దాటిన ఉత్పత్తి

ఆత్మకూరు ,అక్టోబరు13: ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో రికార్డుకు చేరువగా ఉత్పత్తి కొనసాగుతోందని ఆదివారం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఏ సూరిబాబు తెలిపారు. ఎగువ నుంచి వరద వస్తున్నందున ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్లు ప్రారంభించి ఉత్పత్తి కొనసాగిస్తున్నామని తెలియజేశారు. ఎగువ ఉత్పత్తి కేంద్రంలో గడిచిన 24 గంటలలో ఐదు యూనిట్లు ప్రారంభించి 3.143 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి రాబట్టామని, ఇప్పటి వరకు 261.142 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగిందన్నారు. అలాగే దిగువ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లు ప్రారంభించి 3.493 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి రాబట్టామని తెలిపారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 239.458 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు నిర్దేశించిన లక్ష్యం 620 మిలియన్ యూనిట్లు ఇప్పటికే 500 యూనిట్లకు పైగా ఉత్పత్తి రాబట్టామని మరో వారం రోజులు వరద ఇదే మాదిరిగానే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

కేఎల్ఐ కాల్వలో ఆటో బోల్తా

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 13: ఆటో అదుపు తప్పి కేఎల్ఐ కాల్వలో బోల్తా పడి ఒకరు మృతి చెందగా.. నలుగురు గాయపడిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సరస్వతీ ఆలయం వద్ద చోటుచేసుకున్నది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటి గ్రామానికి చెందిన పత్తి కూలీలు ట్రాలీ ఆటోలో పత్తి తీసేందుకు వెళ్తుండగా ఆటో అదుపు తప్పి జిల్లా కేంద్రంలోని సరస్వతీ గుడి ముందున్న కేఎల్ఐ కాల్వలో పడింది. ఈ ప్రమాదంలో ఫాతిమాబేగం(45)మృతి చెందగా మరో నలుగురు మహమ్మద్ హమీతూన్, రసూల్‌బీ, ఫౌజియా, ఎండి.హుస్సేన్‌లు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ సయ్యద్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐతోల్‌లో సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ సందడి



గ్రామస్థులతో కలిసి జమ్మి చెట్టు వద్దకు వెళ్తున్న దర్శకుడు నాగ్ అశ్విన్

తాడూరు, అక్టోబరు 13: ప్రముఖ సినీ దర్శకుడు నాగ్‌అశ్విన్ దసరా పండుగను తన సొంత ఊరిలో జరుపుకున్నారు. శనివారం ఉదయం 11గంటలకు తండ్రి జయ రాంరెడ్డి, తల్లి జయంతితో పాటు భార్య, కుమారుడితో స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్‌లో సందడి చేశారు. తన కుమారుడితో బుల్లెట్ వాహనంపై గ్రామంలో తిరుగుతూ తన సింప్లిసిటీని కొనసాగించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి జమ్మి చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజే సుకున్నారు.

పండుగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బొర్ర కృష్ణ (ఫైల్)

మిడ్జిల్, అక్టోబరు 13: పండుగరోజు కుటుంబ సభ్యులతో సొంత గ్రామంలో సంతోషంగా గడిపేందుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామానికి చెందిన బొర్ర కృష్ణ(48)నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో వ్యాపారం చేసేవారు. దసరా సందర్భంగా సొంత గ్రామంలో జరుపుకోవాలని భార్య శకుంతలతో పాటు ఇద్దరు పిల్లలను ముందుగానే పంపించాడు. తాను సాయంత్రం కల్వకుర్తి నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా శనివారం సాయంత్రం మిడ్జిల్‌లోని నియంత్రిక బోర్డుకు బైక్ ఢీకొనడంతో కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కోస్గి, అక్టోబరు 13 : బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం హన్మాన్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మల్లేష్ (31) ఆటోను కడిగేందుకు ఓ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అదుపు తప్పి కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్థలు మృతదేహాన్ని బయటకు వెలికి తీశారు. మృతుడికి భార్య కౌసల్యతోపాటు ఓ కూతురు, కుమార్తె ఉన్నారు.

నేడు పేటలో ఆర్ఎస్ఎస్ సంబురాలు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 13 : నారాయణపేటలో సోమవారం 14వ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శత వసంతోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నట్లు నగర కార్యవాహ మరారీ వెంకట్రాములు ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు పళ్ల ఆంజనేయస్వామి ఆలయం నుంచి స్వయం సేవకుల పథ్ సంచాలన్ ఉంటుందన్నారు. అనంతరం శీల గార్డెన్‌లో జరిగే సభకు ముఖ్య అతిథిగా డాక్టర్ మల్లికార్జున్, ముఖ్య వక్తగా లింగం శ్రీధర్‌జీ పాల్గొంటారన్నారు.

టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి

- బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్బూద్‌బిన్ అహ్మద్‌జాకీర్



ఉమ్మడి జిల్లా పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 13 : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా పురుషుల జట్టు చాంపియన్‌గా నిలువాలని బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్బూద్ బిన్ అహ్మద్‌జాకీర్ సూచించారు. సోమవారం నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్ వైఎంసీ మైదానంలో నిర్వహించున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుషుల జట్టును తరలివెళ్లింది. ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో నసూరుల్లా హైదర్, మీర్‌ఖలీద్‌అలీ, మహ్మద్ ఇలియాజ్, ఫారుక్‌ముకర్రం, కోచ్‌ఖలీల్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టు..

పృథ్వీరాజ్, రషీద్, ఉదయ్‌కుమార్, అజహర్‌మహమూద్, సయ్యద్‌అలీ, ఖాజాసలాం, కిరణ్‌కుమార్, అలీ అబ్దుల్ బాసిత్, రోహిత్ కుమార్, జాకీ, రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్‌రాఫె.

నేడు అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 13: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నవంబర్‌లో 2 నుంచి వరంగల్, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్ల ఎంపికలు సోమవారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో చేపట్టనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్రీడాకారులు జనన ధ్రువీకరణ, ఆధార్, తెల్లటి క్రీడా దుస్తులతో హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జట్లు ఎంపిక చేసి, ఆయా జట్లకు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

'దాడి చేసిన ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి'

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 13 : దసరా పండుగ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పైకి వచ్చిన తమపై ఏఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి అకారణంగా దాడి చేశారని ఆదివారం నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సందర్భంగా జమ్మి చెట్టు దగ్గరికి వెళ్లడంతో ఏఎస్‌ఐ నిరంజన్ రెడ్డి తమపై దాడి చేసి కొట్టారని యువకులు అంకూరి మహేష్, పాదాల శివ, దాసరి హరికృష్ణ, బండారు నాగరాజులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని గన్యాగుల గ్రామానికి చెందిన వారమని చెప్పినప్పటికీ తమపై అకారణంగా దాడి చేశారని వారు వాపోయారు. మాపై దాడి చేసిన ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లి, అక్టోబరు 13: ఎర్రవల్లి మండల కేంద్రానికి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయని ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ముందువెళ్తున్న వరికోత మిషన్‌ను ప్రమాదవశాత్తు వెనుక నుంచి డీసీఎం కొట్టడంతో వరికోత మిషన్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయని తెలిపారు. అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించి, డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉమామహేశ్వరంలో భక్తుల సందడి

అచ్చంపేటఅర్బన్, అక్టోబరు 13: ఉమామహేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులతో సందడిగా నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కర్నాటక, మహారాష్ట్ర ఉమ్మడి మహబూబ్‌నగర్ నల్లగొండ, హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు వీరయ్య, రామ్మూర్తి ఆనంద్‌శర్మ, చంద్రశేఖర్, రాజశేఖర్‌లు ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారు, అయ్యవార్ల ఉత్సవ మూర్తులకు భక్తులు పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేశారు.

ఆలయానికి దాదాపు 15వందల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, లక్ష్మీనారాయణ, కవికుమార్, శంకర్ దామోదర్ ఉన్నారు.



ఈశ్వరునికి అభిషేకం చేస్తున్న భక్తులు



వరి పొలాల్లోకి వెళ్తున్న కేఎల్‌ఐ కాల్వ నీళ్లు

కేఎల్ఐ కాల్వకు గండి

చారకొండ, అక్టోబరు 13: మండలంలోని గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ డి-82 ప్రధాన కాల్వకు శుక్రవారం రాత్రి గండి పడింది. ఇటీవల కేఎల్‌ఐ ద్వారా సాగునీరు దిగువ పొలాలకు సంబంధిత అధికారులు వదిలారు. దీంతో కేఎల్‌ఐ కాల్వ కళకళలాడింది. డి-82 ప్రధాన కాల్వ 15 కిలో మీటర్ వద్ద కాల్వకు గండి పడటంతో కాల్వలోని నీరంత సమీప చింతచెరువు, తూముచెరువు, కుమ్మరికుంటలు నిండి అలుగు పారుతున్నాయి. కాల్వకు అనుసరించి రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. కడారి పెద్దయ్య, లింగయ్య, వెంకటయ్య, జంగమ్మ, లక్ష్మమ్మ, అలివేలు, లక్ష్మీదేవి, ఎల్లయ్య, శ్రీను, లక్ష్మయ్యలకు చెందిన 20 ఎకరాల పంట పొలాలు ఇసుకతో నీట మునిగిపోయాయి.

ఈ కాల్వను పలువురు రైతులు చెరువులను నింపేందుకు గండి కొట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకొన్న నీటి పారుదలశాఖ డీఈ సమ్మయ్య, సైట్ ఇంజనీర్ సప్తగిరిలు శనివారం రాత్రి ఎక్స్‌వేటర్ సహాయంతో గండికి మరమ్మత్తులు చేపట్టి పూడ్చి వేశారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

- చిన్నపోతులపాడులో దళిత మహిళపై దాడి

- ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళనతో ఘటన వెలుగులోకి..

మానవపాడు, అక్టోబరు 13: మండల పరిధిలోని చిన్నపోతులపాడుకు చెందిన ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ అట్రాసీటీ కేసు నమోదైందని ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చిన్నపోతులపాడు గ్రామానికి చెందిన దళిత మహిళ ప్రశాంతమ్మ (ఎస్తేరమ్మ) ప్రతిరోజు సాయంత్రం జీవనధారం కోసం ఇంటి ఎదుట బజ్జీల బండి పెట్టుకునేది. బజ్జీల బండికి ఎదురుగా ఉన్న ఇంటి వారు చాకలి యుగంధర్, చాకలి సత్తి, అరుణమ్మ తమఇంటి ముందు బండి తీసివేయాలని గురువారం సాయంత్రం ప్రశాంతమ్మపై దాడి చేశారు. ఈక్రమంలోనే బండిని తోయడంతో కాగుతున్న నూనె ఆమె కుడిభుజంపై పడడంతో శరీరం కాలింది. ఈ ఘటనపై ఆమె మామ ఏసన్న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఎస్‌ఐ చంద్రకాంత్ కేసు నమోదు చేశారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియడంతో ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజు, దళిత సంఘాల నాయకులు శనివారం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసీటీ కేసుతో పాటు దాడి, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గద్వాల డీఎస్పీ సత్యానారాయణ గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పలువురితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కర్నూలులో ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న ప్రశాంతమ్మతో మాట్లాడి వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీఐ టాటాబాబు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్థులు

అట్టహాసంగా దసరా ఉత్సవాలు

- శమీ వృక్షానికి పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి - పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను తిలకించిన పట్టణ ప్రజలు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 13: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం మినీ ట్యాంక్‌బండ్‌పై శనివారం బతుకమ్మ, దసరా ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. ట్యాంక్‌బండ్ పొడవునా రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి భారీ బాణసంచాలు, డీజేలు, ఎల్‌ఈడీ లైట్ల మిరిమిట్లతో పట్టణ ప్రజల కోలాహలం నడుమ వేడుకలు వైభవంగా జరిగాయి. కళకళలాడుతున్న బతుకమ్మలు, దసరా ఉత్సవాల వైభవం సందర్శకులను కట్టిపడేశాయి. బుద్ధ ఘాట్ వద్ద శమీ వృక్షానికి స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు.

అనంతరం లవ్ ఎన్‌జీకేఎల్ వద్ద ఎమ్మెల్యే బాణాసంచాను చేతబూని కాల్చి యువతను ఉత్సాహ పరిచారు. బతుకమ్మ ఘాట్ వద్ద ఎమ్మెల్యే దంపతులు మహిళలతో కలిసి సద్దుల బతుకమ్మ ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. తదనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద ఎమ్మెల్యే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను ఏకం చేసే బతుకమ్మ మన సంస్కృతి, సాంప్రదాయాలను ముఖ్యమైన భావన అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు, యువత నృత్యాలు, పాటలు ఉత్సవాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు ప్రత్యేకించి యువత, మహిళలు, పిల్లలు హాజరై వేడకలను మరింత ఆనందంగా మార్చారు. మినీ ట్యాంక్‌బండ్ దసరా ఉత్సవాల వద్ద పట్టణ ముస్లింలు హిందూ సోదరులను గులాబి పువ్వులు అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ట్యాంక్‌బండ్ వద్ద సందర్శకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎండబెట్ల, ఐతోల్, సిర్సవాడ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు మంతటి గేట్ మీదుగా ట్రాఫిక్ దారి మళ్లించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక సీఐ కనకయ్య, ఎస్‌ఐ గోవర్ధన్ పర్యవేక్షణలో గట్టి బందోబస్తు నిర్వహించి వేడుకలను ప్రశాంతంగా ముగించారు.

కౌన్సిలర్లు కావలి శ్రీనివాసులు, నిజాముద్దీన్, తీగల సునేంద్ర, జక్కా రాజవర్ధన్‌రెడ్డి, బాదం సునీత నరేందర్, పద్మమ్మ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్, గౌస్, సలీం, గంగా లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సరిత దంపతులు

బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

కొల్లాపూర్, అక్టోబరు 13: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందిన సంఘటన కొల్లాపూర్ మండలం చింతలపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లాపూర్ మండల పరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కురుమయ్య, దేవమ్మ దంపతుల కుమారుడు హరికృష్ణ (23) కొల్లాపూర్‌లో హోండా షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం చింతలపల్లి గ్రామం నుంచి యన్మన్‌బెట్ల గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో రహదారిపై ఉన్న గుంతలో బైక్ అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే హరికృష్ణ మృతి చెందినట్లు తెలిసింది. పండగ పూట తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడం తో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



హరికృష్ణ (ఫైల్)

పరిగి శివారులో..

మద్దూర్: వికారాబాద్ జిల్లా పరిగి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దూర్ మండలం చింతల్‌దిన్నె గ్రామానికి చెందిన మొగులప్ప (32) మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొగులప్ప జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. ఈ క్రమంలో పరిగి శివారులో కారు ఢీకొనడంతో తీవ్రగాయాలు అయ్యాయి.

కనుల పండువగా గుట్టమీది జాతర

నారాయణపేట రూరల్, అక్టోబరు 13 : మండల పరిధిలోని లక్ష్మీపూర్ గుట్టమీద వెలసిన వేంకటేశ్వర స్వామి జాతర శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ఆదివారం తెల్లవారు జామున స్వామివారి మహా రథోత్సవం భక్త జన సంద్రం మధ్య కనుల పండుగగా జరిగింది. పరిసర గ్రామాలతో పాటు కర్ణాటక సరిహద్దు నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మిఠాయి, చిన్నారుల ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి.

మహిళలు బొడ్డెమ్మలు, బతుకమ్మ నృత్యాలు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన గ్రామస్తులచే రెట్టపట్ల పోటీలు నిర్వహించగా, ముగ్గురిని ఓడించిన వ్యక్తికి అర తులం వెండి ఉంగరంతో పాటు రూ.501 అందజేసి శాలువా, పూలమాలతో సన్మానించారు.



కుక్కల బెడద

- చిన్నారులను వెంబడిస్తున్న శునకాలు

- పట్టించుకోని మునిసిపల్ అధికారులు



కోస్గి బస్టాండ్‌లో గుమిగూడిన కుక్కలు

కోస్గి, అక్టోబరు6: కోస్గి బల్దియాలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కొంతకాలంగా చిన్నారులను వెంబడిస్తూ.. కుక్కలు కరుస్తున్నా.. మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతకాలంగా పట్టణంలో చిన్నారులు పాఠశాలకు ఒంటరిగా వెళ్తున్న సమయంలో వెంబడించి దాడి చేస్తున్నాయి.

దీంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ పాఠశాలలకు వెళ్తున్నారు. తప్పని పరిస్థితిలో తల్లిదండ్రులు విద్యార్థులను వెంట తీసుకెళ్లి వదిలిపెట్టడం, మళ్లీ తీసుకురావడం చేస్తున్నారు. ఈ విషయంపై పదేపదే చెప్పినా.. మునిసిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీధికుక్కల బెడద లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

అందుబాటులో వ్యాక్సిన్ లేదు..

పిచ్చికుక్కలకు ఇచ్చే టీకాలు ప్రస్తుతం మనదగ్గర లేవు. కోస్గి పశువైద్యశాలకు టీకాలు పంపమని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. టీకాలు రాగానే సమాచారం అందిస్తాం.

- విశాల, పశువైద్యాధికారి

రెండు రోజుల్లో పట్టుకుంటాం..

కోస్గి మున్సిపాలిటీలోని కుక్కలను రెండు రోజుల్లో పట్టుకునేందుకు ప్రణాళికలు తయారు చేశాం. కోస్గిలో ఎ నిమల్ బర్త్‌సెంటర్ లేదు. కుక్కలను పట్టుకుని నారాయణపేటకు తరలిస్తాం.

- శశిధర్, కమిషనర్

దేవాలయంలో చోరీ

వెల్దండ, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని బుధవారపేట ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. మరుసటి రోజు ఆలయానికి వచ్చిన భక్తులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి స్థానికులకు తెలియజేశారు. కాగా, హుండీలో ఎంత సొమ్ము చోరీ అయ్యిందో తెలియరాలేదు. ఇటీవల దేవీశరన్నవరాత్రులు నిర్వహించిన సందర్భంగా హుండీలో డబ్బులు ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

మహబూబ్‌నగర్, అక్టోబరు 13 : పట్టణంలోని అప్పన్నపల్లిలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందాయి. అప్పన్నపల్లికి చెందిన సామె మూర్తయ్య, సామె మల్లేష్‌లు తమ వ్యసాయ పొలాల వద్ద గేదెలను కట్టేయగా, ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తెగి గేదెలపై పడటంతో అవి మృతిచెందాయి. వీటి విలువ దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. గేదెలపై ఆధారపడి జీవనం సాగించే తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

చౌదర్‌పల్లిలో..



మృతి చెందిన పాడి గేదె

వంగూరు, అక్టోబరు 13: మండలంలోని చౌదర్‌పల్లిలో విద్యుదఘాతానికి గురై పాడి గెదే మృతి చెందింది. రైతు పర్వత్‌రెడ్డి వ్యవసాయ పొలంలో గెదే పచ్చిగడ్డి మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వున్న ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవశాత్తు వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు పర్వత్‌రెడ్డి తెలిపారు. పాడి గెదే విలువ రూ. 60 వేలు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరారు.

వేడినూనెలో పడి బాలుడికి గాయాలు

వెల్దండ, అక్టోబరు 13 : మండల కేంద్రానికి చెందిన తొమ్మిదేళ్ల పిల్లి దినేష్ అనే చిన్నారి వేడినూనెలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పిల్లి పావని ఇంట్లో పండుగ సందర్భంగా పిండివంటలు చేసిన అనంతరం పొయ్యిపై వేడినూనె గిన్నెను అలాగే ఉంచింది. ఈ క్రమంలో దినేష్ పొయ్యి దగ్గరకు వెళ్లి ఆడుకుంటూ ఉండగా వేడినూనె గిన్నె కిందపడింది. దీంతో అక్కడే ఉన్న దినేష్ జారి నూనెలో పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వైద్యుడి ఆత్మహత్య

మిడ్జిల్, అక్టోబరు 13: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వేముల సబ్‌సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు రుషికేష్(38) జిల్లా కేంద్రంలోని ఉరేసుకుని మృతి చెందినట్లు మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు శివకాంత్ ఆదివారం తెలిపారు. రుషికేష్ భార్య సౌజన్య మండలంలోని వస్పుల గ్రామంలోని సబ్‌సెంటర్‌లో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుషికేష్ గతేడాది నుంచి మండలంలోని విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఈయన సొంత గ్రామం మక్తల్ మండల కేంద్రమని వైద్య సిబ్బంది తెలిపారు.

మైసమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు నిర్వహిస్తున్న మేకల గౌరమ్మ

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 13 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మేకల గౌరమ్మ పూజలు నిర్వహించారు. ఆమె వెంట మైసమ్మ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు మేకల చంద్రయ్య, లింగస్వామియాదవ్ తదితరులు ఉన్నారు.

ధూంధాంగా..

● దసరా వేడుకలు

- ఉత్సవాల్లో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు

కల్వకుర్తి, అక్టోబరు 13 : కల్వకుర్తి పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం సమీపంలోని మైదానంలో జరిగిన దసరా వేడుకలకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఆయన సతీమణి మాధవిరెడ్డితోపాటు పలువురు నాయకులు హాజరయ్యారు. దసరా ఉత్సవాలకు పట్టణంలోని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శమీ పూజ నిర్వహించారు. రావణాసురుని దహనం మెరిబిట్లు గొల్పే రంగు రంగుల టపాసులతో కొనసాగింది. అంతకు ముందు దసరా ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సింహంగా జరుపుకుంటున్న దసరా పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమానికి తాము ఎల్లప్పుడు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● కల్వకుర్తిటౌన్: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వెండిచీర అలంకరణలో భక్తులకు దర్శనం జరిగింది. దేవాలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రాతఃకాలపూజలు, దంపతులచేత సామూహిక కుంకమార్చనలు చేశారు. ఆదివారం అమ్మవారికి కుంభంపోయడం, ఖడ్గాలు వేయడం, అమ్మవారి లడ్డూ వేలం, చీరలవేలం వేశారు. పట్టణంలోని పూరవీధులగుండా అమ్మవారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అమ్మవారి లడ్డూను దాచేపల్లి నరసింహస్వామి రూ.71,116 లకు దక్కించుకున్నారు. నవరాత్రులు అమ్మవారు ధరించిన చీరలను వేలంపాటలో రూ.16,65,336 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. దుర్గామాత చీరను అత్యధికంగా రూ. 1,70,116 లకు వాస రవికుమార్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దేవాలయ ట్రస్టు చైర్మన్ జూలూరు రమేష్‌బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు గంప శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణరాజు, దేచేపల్లి నితిన్‌రకుమార్, కోశాధికారులు పానుగంటి నవీన్, సంబుతరుణ్, వాస మనీష్, ఉత్సవ కమిటీ ముఖ్యసలహాదారులు దచేపల్లి శ్రీనివాసులు, సంబు ముత్యాలు, వాస శేఖర్, గంధం కిరణ్‌ప్రసాద్, గందెరవి, కల్వరమేష్, గుబ్బ వెంకటేష్, కంది ప్రవీణ్, గార్లపాటి శ్రీనివాసులు, జిల్లాఅదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, శివ జగదీశ్వర్, ఆర్యవైశ్య సంఘం, అవోప, వాసవీక్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ప్రజలు ఆలయాలకు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు అనంతరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణ తదితరులు ఉన్నారు.

● అచ్చంపేట/టౌన్: విజయదశమి వేడుకలు పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కొత్తబట్టలు ధరించి పాలపిట్టను దర్శించుకుని ఊరూవాడా ముస్తాబై శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయం పక్కన ఏర్పాటు చేసిన జమ్మి చెట్టు వద్దకు భారీ ఎత్తున వెళ్లి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సంతోషంగా ఉండే విధంగా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు,నాయకులు రాజేందర్, రఘు, రామనాథం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: మండల కేంద్రంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు బ్యాండు మేళాల నడుమ జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం జమ్మి ఆకులను తెంపి ఒకరికొకరు పంచుకొని శుభకాంక్షలు తెలుపుకొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అ ధ్యక్షుడు జమ్మికింది బాల్ రాంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పా నుగంటి అంజయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గజ్జే యాదయ్య గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, కేశమోని శంకర్‌గౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, కొండల్‌గౌడ్, శ్రీరాము లుగౌడ్, లక్ష్మయ్యగౌడ్, గుండె శివ, నారయ్యగౌడ్, శ్రీనయ్యగౌ డ్, సత్యంగౌడ్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు ఊర్కొండపేట, మాదారం, రేవల్లి, ముచ్చర్లపల్లి, రాంరెడ్డిపల్లి, ఇప్పపహడ్, బొమ్మరాజుపల్లి తదితర గ్రామాల్లో శనివారం విజయదశమి వేడుకలను ఆయా గ్రామాస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి కోలటాలు, బతుకమ్మలు నిర్వహించారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ శాంతకుమారి, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యావ నిఖిల్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, నాయకులు మ్యాకల శ్రీనివాసులు, పర్వత్‌రెడ్డి, గిరినాయక్, గోపీనాయక్, నాగోజీ, మనోహర్‌రెడ్డి, దయాకర్, గణేష్ ఉన్నారు.

● తాడూరు: సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో దసరా పండుగను పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. ఐతోల్ గ్రామంలో ఎస్‌వీఎస్ హాస్పిటల్ అధినేతలు కృష్ణారెడ్డి, రాంరెడ్డితోపాటు డాక్టర్ జయరాంరెడ్డి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా పండుగ వేడుకలను గ్రామస్థులతో కలిసి పంచుకున్నారు. భలాన్‌పల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ శ్రీదేవితో పాటు తాడూరు మండల కేంద్రంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మందడి రోహిణి, ఎట్టిధార్‌పల్లిలో మాజీ వైస్ ఎంపీపీ శివలీల, తుమ్మలసూగురు గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, మేడిపూర్‌లో సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు దసరా పండుగ పాల్గొన్నారు.

● తెలకపల్లి: మండల కేంద్రంలో వివిధ గ్రామాల్లో శనివారం విజయదశమి పర్వదిన వేడుకలు ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మామిడి తోరణాలతో గృహాలను అలంకరించి నూతన వస్త్రాలను ధరించి తమ పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జమ్మి వృక్షం దగ్గరకు చేరుకుని వేద పండితుల ఆధ్వర్యంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మి పత్రాలను శనగలను పంచిపెట్టారు. ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కల్వకుర్తిలో రావణాసురుని దహనం



ఉత్సవాల్లో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆయన సతీమణి మాధవిరెడ్డి, నాయకులు

విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి

కొల్లాపూర్, అక్టోబరు 13: విజయదశమి వేడుకలు అందరి జీవితాల్లో విజయాలు చేకూర్చాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం విజయదశమి వేడుకల సందర్భంగా కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని కొల్లాపూర్ కోట వీధి శమీ వృక్షం కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని వరిదెల శమీ వృక్షం దగ్గర దుర్గామాతను దర్శించుకుని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరిదెల శమీ వృక్ష అభివృద్ధి కమిటీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కోట వీధి శమీ వృక్షం వద్ద మాజీ ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో బతుకమ్మ సంబురాలలో పాల్గొని మహిళలతో కలిసి కాసేపు బతుకమ్మ ఆడారు. అనంతరం ఆడపడుచులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జంబులయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు

కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో విజయదశమి వేడుకల సందర్భంగా భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా సోమశిల గ్రామంలో లలితాంబిక సోమేశ్వర ఆలయంలో అమ్మ వారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మండలంలో ఎల్లూరు , నార్లాపూర్, ముక్కిడిగుండం, కుడికిల్ల, అంకిరావుపల్లి, మాచినేనిపల్లి, రామాపురం గ్రామాలలో ఆలయాలలో శమీ వృక్షాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి విజయదశమి వేడుకలను భక్తులు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.

● పూజలు నిర్వహించిన నాయకులు

విజయదశమి వేడుకల సందర్భంగా వరిదెల శమీ వృక్షం వద్ద కోట వీధి శమీ వృక్షం వద్ద కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మ వారిని కొల్లాపూర్ మునిసిపల్ చైర్మన్ మేకల రమ్య మునిసిపల్ కౌన్సిలర్లు నరసింహరావు, షేక్ రహీంపాషా, బరిగెల రాముడు, మేకల శిరీష, పిన్నంశెట్టి జ్యోతి శేఖర్, మాచుపల్లి బాలస్వామి, బరిగెల లక్ష్మి, కర్నె అలివేలు, ఎండీ నయూం, సింగిల్‌విండో డైరెక్టర్ పప్పుల నరసింహ, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ప్రజాప్రతినిధులను నాయకులను శాలువా పూలమాలలతో సన్మానించారు. అదే విధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు వరిదెల శమీ వృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ఎల్లేని సుధాకర్ రావును, బీజేపీ నాయకులను శాలువా పూలమాలతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావు అమ్మ వారిని దర్శించుకోవడంతో మండప నిర్వాహకులు వారిని శాలువా పూలమాలలతో సత్కరించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కొల్లాపూర్‌లో వరిదేల శమీ వృక్షం వద్ద అమ్మ వారిని దర్శించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

పూజలు చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

● పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు పూజలు నిర్వహించారు. ఆదివారం పెద్దకార్పాముల గ్రామాన్ని సందర్శించి భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎల్లేని సుధాకర్‌రావు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కొల్లాపూర్ నియోజకవర్గం ప్రజలు అమ్మవారి కృపతో సుఖసంతోషాలతో మెలగాలని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



ఐతోల్ గ్రామంలో జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ఎస్‌వీఎస్ హాస్పిటల్ అధినేతలు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, డాక్టర్ జయరాంరెడ్డి



ఊర్కొండపేటలో జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు



ముగింపు ఉత్సవాల్లో కల్వకుర్తి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



అచ్చంపేట పట్టణంలో జమ్మి చెట్టు పూజ సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



చారకొండలో బ్యాండు మేళాల నడుమ జమ్మివృక్షం వద్దకు వెళ్తున్న గ్రామ పెద్దలు

క్రీడలతో మానసికోల్లాసం



కల్వకోల్ గ్రామంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పగిడాల శ్రీనివాసులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 13 : క్రీడలు మనిషికి మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని కొల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో దివంగత సింగోటం రామన్న స్మారకార్థంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం డాక్టర్ పగిడాల శ్రీనివాసులు ప్రారంభించారు. మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్, నాయకులు జగదీశ్‌గౌడ్, కుర్మయ్య, క్రీడా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహాన్ని పెంచుతాయి

తిమ్మాజిపేట: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటుగా స్నేహాన్ని పెంచుతాయని శాంతియుత వాతావరణంలో క్రీడలు కొనసాగించాలని మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండలో గత రెండు రోజులుగా కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిశాయి. క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారులను ద్దేశించి మాట్లాడారు. అనంతరం క్రికెట్ క్రీడలలో విజేతగా నిలిచిన వారియర్ టీంకు ప్రథమ బహుమతిగా 8వేల నగదు షీల్డ్ అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన లయన్ టీంకు 4వేలు నగదు షీల్డ్ బహుమతులను అందజేశారు. నిర్వాహకులు సద్దాం, బంటులకు అందరూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు సత్యంయాదవ్, వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- వైద్యులను ఆదేశించిన ఎమ్మెల్యే

కందనూలు, అక్టోబరు 13 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి వైద్యులను ఆదేశించారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్ర సమీపంలో బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటనలో మంతటి గ్రామానికి చెందిన మహిళ మృతి చెందగా పలువురిని వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటన తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని సంఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎల్‌వోసీని అందజేసిన ఎమ్మెల్యే



రూ. ఐదున్నర లక్షల ఎల్‌వోసీని అందిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు: మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో గత కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న శేఖర్ కుమార్తె స్పందన అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు కొత్తపల్లి వెంకటయ్య వినోద్‌కుమార్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. స్పందన ఆరోగ్యాన్ని బాగు చేసేందుకు ఐదున్నర లక్షల రూపాయల ఎల్‌వోసీని ఆదివారం ఆ అమ్మాయి ఇంటికొచ్చి నేరుగా అందజేశారు. రానున్న రోజుల్లో పాప ఆరోగ్యం కుదుటపడేంత వరకు సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. మొత్తంగా పాప వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీ రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర రుసుం చెల్లింపునకు 21 చివరి తేదీ

కందనూలు, అక్టోబరు 13 : హజ్‌యాత్రకు ఎంపికైన యాత్రికులు మొదటి విడత హజ్ యాత్ర డబ్బులు చెల్లించడానికి అక్టోబరు 21వ తేదీ అని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్‌అహ్మద్ తెలిపారు. ఆదివారం జిల్లా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ యాత్రికుడు మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ఒక లక్ష 30వేల 300రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్‌బీఐ లేదా యూనియన్ బ్యాంక్ ద్వారా డబ్బులు చెల్లించాలని తెలిపారు. హజ్ అప్లికేషన్ ఫామ్, ధ్రువీకరణ పత్రం, డబ్బులు డిపాజిట్ చేసిన స్లిప్, మెడికల్ స్క్రీనింగ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పాస్‌పోస్టు జిరాక్స్‌పై సెల్ఫ్ అటాస్ట్ సంతకంతో సమర్పించాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సొసైటీ బాధ్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు. జిల్లా హజ్ సొసైటీ సెక్రటరీ మహమ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు అబ్దుల్ హక్, వకీల్ మౌలానా, ప్రచార కార్యదర్శి నూరుల్‌హక్, మహమ్మద్ ఎజాజ్ నక్ష బందీ, మహమ్మద్ హమీద్, మహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమ్రాబాద్, అక్టోబరు 13: అమ్రాబాద్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు సంతోష్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలుసుకుని ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దుర్గానాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని ఆయన దగ్గరికి వెళ్లి మాట్లాడారు.

బాల్యమిత్రుల ఆర్థిక సహాయం

పదర, అక్టోబరు 13: మండలంలోని వంకేశ్వర గ్రామంలో 2002-03 సంవత్సర పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన ఎలిమిలేటి వీరయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు ఆదివారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.8వేల500 ఆర్థిక సహాయం చేశారు. మృతి చెందిన వీరయ్యకు ఇద్దరు పిల్లలున్నారు. వారి చదువు విషయంపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో మాట్లాడుతామని భరోసానిచ్చారు. రమేష్, నాగేష్, ఆంజనేయులు, వెంకటేష్, ఆంజనేయులు తదితరులున్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు..

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని కల్వకోల్ గ్రామానికి చెందిన సంగమాల వెంకటస్వామి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అనుచరుడు శివగౌడ్ మృతుని కుటుంబాన్ని సందర్శించి భార్య సంగమాల లక్ష్మీకి నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ స్వామి, నాయకులు తలారి మద్దిలేటి, సోమిశెట్టి ప్రదీప్, కర్తల రాముడు, కావలి కృష్ణ, రాముడు, బాబు, అంజి, కుర్మయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి/టౌన్, అక్టోబరు 13: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దసరా పండుగకు తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వచ్చారు. హెలిపాడ్ వద్ద సీఎంకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. సీఎం చదువుకున్న తాండ్ర పాఠశాలకు రూ.5కోట్లు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, సీఎంకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, మాజీ సర్పంచులు బృంగి ఆనంద్‌కుమార్, యెన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గోలి సురేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం

తిమ్మాజిపేట, అక్టోబరు 13 : మండలంలోని పలు గ్రామాల్లో అందంగా అలంకరించిన మండపాల్లో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారికి పదిరోజులుగా ఘనంగా పూజలు నిర్వహించారు. అప్పాజిపల్లి, తిమ్మాజిపేట, పోతిరెడ్డిపల్లి, మారేపల్లి, గొరిట, మరికల్, నేరేళ్లపల్లి గ్రామాల్లో దుర్గాదేవి అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తూ అందరికీ శుభాలు కలగాలని ఆశీర్వదించారు. శని, ఆదివా రాల్లో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తూ మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ యువకులు కోలాటాలు నృత్యాలు చేస్తూ డప్పు మేళాల చప్పుళ్లతో గ్రామాల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించి ఆయా గ్రామాల శివారులోని ఊర చెరువుల్లో దుర్గామాతను నిమజ్జనం చేశారు.



అప్పాజిపల్లిలో బతుకమ్మ పాటలతో దుర్గామాతను ఊరేగిస్తున్న మహిళలు

చంద్రాయన్‌పల్లిలో నీటి ఎద్దడి

చారకొండ, అక్టోబరు 13: మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో దసరా పండుగ పూట తాగునీటికోసం గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు గత మూడు రోజులుగా సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. గ్రామపంచాయతీకి సంబంధించిన మూడు బోర్లకు గాను రెండు బోర్లు పనిచేయక పోవడంతో ఉన్న ఒక్క బోరు నీరు సరిపడక పోవడంతో గ్రామ పంచాయతీ నుంచి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో గ్రామస్థులు ఎగబడి నీటిని పట్టుకొన్నారు. గ్రామంలో తరచూ నీటి సమస్య ఏర్పడుతున్న అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధి కారులు స్పందించి మిషన్ భగీరథ జలాలు సరఫరా చేసి చెడిపోయిన బోరుమోటర్లకు మరమ్మతులు చేయించి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ స్థులు కోరుతున్నారు. మిషన్ భగీ రథ పైపులైనుకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను అందిస్తామని ఆ శాఖ ఏఈ సంతోష్ తెలిపారు. చెడిపో యిన బోరు మోటర్లకు మరమ్మతులు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీవణి తెలిపారు.



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

ఘనంగా సద్దుల బతుకమ్మ

కల్వకుర్తిటౌన్, అక్టోబరు 13: మండలంలోని గుండూరు గ్రామంలో ఆదివారం ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. దసరా పండుగ కోసం వివిధ ప్రాంతాల్లో ఉండేవారు గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామానికి చెందిన మహిళలు, యువతులు, చిన్నారులు సద్దులబతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన వివిధరకాల పూలతో బతుకమ్మలను పేర్చి గ్రామంలోని రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వేదికవద్ద పెద్దఎత్తున వివిధ రకాల పాటలకు మహిళలు ఆడిపాడగా, పలువురిని ఆకట్టుకున్నది.



గుండూరు గ్రామంలో ఆకట్టుకున్న సద్దుల బతుకమ్మ వేడుకలు

నేడు సద్దుల బతుకమ్మ

మునిసిపల్ పరిధిలో సోమవారం సద్దులబతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పట్టణ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లికల్ రహదారికి సమీపంలోని కపిలేశ్వస్వామి గట్టవద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టైలరింగ్ శిక్షణకు మహిళలు దరఖాస్తులు చేసుకోవాలి

కందనూలు, అక్టోబరు 13 : భగవాన్ శ్రీసత్యసాయి 99వ జన్మదినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ శ్రీసాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్టు, సత్యసా యి సేవా సమితి వారి ఆధ్వర్యంలో మహిళలకు 45రోజుల పాటు లేడీస్ టైలరింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగులు కుట్టుట తయారీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, శ్రీసాయి ప్రశాంతి చారిట బుల్ సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు తెలిపారు. నాగర్‌క ర్నూల్ పట్టణంలోని సత్యసాయి సేవా దేవాలయ ఆవరణలో ఈ నెల 23నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. మహిళా అభ్యర్థులు లేడీస్ టైలరింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో ఉచిత శిక్షణ మహిళా శిక్షకురాలుచే ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులు సత్యసాయి దేవాలయ కార్యాలయంలో దరఖాస్తులు నేరుగా అందజే యాలని బయోడేటా ఫామ్, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ సెల్ నెంబరుతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.